# మనసు వినని మాట

పగలు హింస నుంచి పరిణామం చెంది రాత్రి నరకంగా మారిన నా జీవితంలో ఇంకో రోజు అనుకుంటూ....

నేనార్పకుండానే ఆరిపోయిన దీపాన్నీ, పొగగా పరిమళిస్తున్న కిరసనాయిల్నీ చారలు చారలుగా చూస్తుండగా...

తలుపు చప్పుడు.!

ఇంత రాత్రివేళ నా ఇంటికొచ్చే వాళ్లెవరూ?' అనుకుంటూ కలుక్కుమన్న నడుముని ఎడంచేత్తో పట్టుకుని గొళ్లెం తీశా.

బయట వీధి కూడా ఆరిపోయింది ఇంట్లో దీపంలాగానే! ఆ ఆరిపోయిన వీధి నేపథ్యంగా ఓ మగ ఆకారం... నీడగా!

"ఎవరూ?"

కుతూహలం తప్ప భయవిభ్రాంతులుండవు నాకు. ఎందుకంటే నా దగ్గర దోచుకోవడానికి ధనం లేదు. సృష్టి ప్రసాదించిన ఆడతనంలోని యౌవనపు తీయదనాన్ని కూడా నలభై అయిదేళ్ళనబడే కాలం కుక్క నాకేసింది! ఇక నాకేం భయం!

మళ్ళీ అడిగా "ఎవరూ"

"నే... సూరిని... సూర్యారావుని." ఎప్పుడో ఒకటిన్నర దశాబ్దం క్రితం విన్న గొంతు కాదది. నాకుతెల్సిన సూర్యారావు నిలువెత్తు మనిషి. ఇలా కుంగిపోయుండడు. నేనువిన్న సూర్యారావు గొంతు ఖంగుమంటుంది. ఇలా జీరపోయుండదు. నేను చూసిన సూర్యారావు దగ్గర కునేగా మరికొళందు అత్తరు పరిమళమొచ్చేది ఇట్లా కుష్టుకంపు కాదు.

"రండి...!" పక్కకు తప్పుకుని

తలుపు మూలకుపెట్టిన సీసాలోని కిరసనాయిల్ని బుడ్డీలోకొంపి, ఒత్తి నలిపి

మళ్ళీ వెలిగించా. బంగారు రంగు కాంతి నా ఇల్లనబడే ఆ గది దారిద్ర్యం మీద చిరుదరహాసంతో మెరిసిపోతూ పరచుకుంది. అప్పుడు చూశా సూర్యారావు గారిని! మాసిపోయిన గళ్ళచొక్కా ఎప్పుడో తెల్లగా ఉండిన అడ్డపంచా, చేతిలో ఓచిరిగిపోయిన ఓ జిప్ బాగ్! ఎంత ముసలివాడైపోయాడీయన?' అని ఆశ్చర్యపడేలా జుట్టూ, ముడతలు పడ్డ మొహం! ఇతన్తోనేనా నేనుఒక సంవత్సరాకలం ఇల్లూ ఒళ్లూ పంచుకున్నది? ఇన్ని సంవత్సరాల్తర్వాత నేను ఆసలిక్కడున్నాని ఎట్లా... ఏమో?...! చాలా చాలా ప్రశ్నల్తో...!

"కూచోండి!" నే పడుకోవడానికి పరచుకున్న బొంతనే చూపించా.

బ్యాగును కింద పెట్టి కష్టపడి కడుపును చేత్తో పట్టుకుని బాధపడ్తూ కూచున్నాడాయన. మొహం చిట్లించినపుడు కనిపించింది. నల్లగా ముందుపళ్లవరుసలో ఓ ఖాళీ.. కాలం నిర్దాక్షిణ్యంగా చేసిన గాయంలాగా...!

"నువ్వు బాగున్నావా అనడగను. నాకు తెలుసు బాగాలేవని. కానీ గత్యంతరం లేక ఇట్లా వచ్చా! బస్టాండులో దామోదరం కలిసి చెప్పాడు నువ్విక్కడున్నావని! వెతుక్కుంటూ వచ్చా. నన్ను క్షమించు, నిన్నిబ్బంది పెడ్తున్నా. నాకుతెలుసు. ఒక్క నాలుగు రోజులు నన్నిక్కడ ఉండనిస్తావనే ఆశతో వచ్చా! వెళ్లిపోతా. ఆరోగ్యం బాగా లేదు. ఆస్పత్రిలో చూపించుకుని వెళ్లిపోతా!" ఆయాసపడుతూ చెప్పాడాయన.

"నాలుగు రోజులా...?" ఉదయం తొమ్మిదినుంచీ సాయంత్రం అయిదు వరకూ ప్లాస్టిక్ బిందెల ఫాక్టరీలో ఒళ్లు నలగ్గొట్టుకుంటే రాలేవి ఇరవై రూపాయలు. నేనే రెండుపూటలా తినలేని సౌభాగ్యం... ఈయనకేం పెట్టనూ? అయినా ఆనందమేనేమో?! ఇంత దరిద్రంలో కూడా నా ఇంటి ముంగిట చేరి, ఆసరాకోసం చేయిజాచి ఓ వ్యక్తి ఆరాటంగా అడుగుతాడని కల కూడా కనలేని నాకు.. నాకిది ఆనందమేనేమో!?

"మంచినీళ్లు తాగుతారా?" అనడిగా. ఆ సమయంలో ఇంకేమి ఇవ్వలేనని తెలిసీ మౌనంగా తలూపాడాయన. పక్క అనబడే చాప బొంతలను వేరు చేసి రెండు పక్కలు చేసి బొంత ఒకరం, చాప ఒకరం పంచుకుని, రాత్రిని నిద్రలోకి మార్చి మమ్మల్ని మేం మరచిపోయే ప్రయత్నాలు చేస్తున్నాం.

జ్ఞాపకాల సినిమా థియేటర్లో కూచుని, గతం అనే చూసిన సినిమాని.... ఎన్నోమారో.. గుర్తులేదు.. మళ్ళీ చూస్తున్నా..

గుడివాడ కళాక్షేత్రం వాళ్లు పిలిస్తే నటనాలయం అడ్డానికి వెళ్తున్నపుడు హరి చెప్పాడు డైరెక్టరు కొత్తాయనని. డైరెక్టరెవరైతే నాకేం? 'నటనాలయం' ఎన్నిసార్లాడేమో..! నిద్దట్లో లేపి మొహానికి రంగేస్తే రంగమెక్కే ధీమా!

"ఓహో..."!అని ఊరుకున్నా.

కానీ సూర్యారావుని చూడగానే అతని మీద అభిప్రాయం ఏర్పడిపోయింది. నిజమైన కళారాధకుడీయన అని!

ఎస్సెసెల్సీతో చదువాపేసి సంపాదించాల్సినవసరం లేకపోడం మూలాన ఉద్యోగం

వెతుక్కోక నాటకాల పిచ్చిలో పడిపోయాడని తెలిసింది.

ఎప్పుడూ తెల్లటి లాల్చీ పైజమాల్లో, గుప్పున కునేగా మరికొళందు అత్తరు వాసన్తో... జల్సాగా ఉండేవాడాయన. మా కంపెనీ కూడా ఆయన పరిచయం తర్వాత ఆయన్ని వదిలేయలేదు. కారణం ఆయన చేతికి ఎముక లేదు.

ఓ రాత్రి రిహార్సల్స్ తర్వాత టాపేసిన రిక్షా గూళ్లో వెళ్తూన్న మా ఇద్దరి శరీరాల మధ్యజరిగిన రాపిడిలోంచి పుట్టిన వేడిలో మేము నిశ్శబ్దంగా చేసుకున్న అంగీకారం సంవత్సరం పాటు నిలిచింది.

దాంతర్వాత సుల్తాన్ చూపిన ఆకర్షణతో, నా అజ్ఞానంతో, అనుభవ రాహిత్యంతో... ముప్ఫయేళ్ళ ప్రాయాన సినిమా ఛాన్స్‌కని మద్రాస్ మెయిలెక్కడం.. ఆఖరు... సూర్యారావుని చూట్టం మళ్లీ ఇదే...!

పదిహేనేళ్ళు గడిచిపోయాయి. సుల్తాన్ మద్రాసు చేరిన తర్వాత ఏదో చిన్న హోటల్‌లో బసచేయించి ఓరెండ్రోజులు అటూ ఇటూ తిప్పి, నా శరీరంతో ఆడుకుని, నే దాచుకున్న డబ్బు మాయమాటల్తో లాగేసి, ఎవరో బ్రోకర్లు పెద్ద పెద్ద డైరెక్టర్లు తెలిసివాళ్ళని ఇద్దరిని గదికి పిల్చుకొచ్చి పీకలదాకా తాగి, నాకూ తాగించి.. ముగ్గురూ కలిసి హేయంగా ఘోరంగా నన్ను వాడుకున్నారు. అసలే ఎంగిలాకుపైన మూడుకుక్కలనుకుని కుమిలిపోయాను.

తర్వాత ఏవియం స్టూడియోకి తీసుఎళ్లి ఈరోజునీకో చిన్న రోల్ టెస్టింగని వందమందిలో ఓదాన్ని చేసి, సాయంత్రం కావస్తూండగా పాచిపోయిన అన్నం పొట్లం పాతిక రూపాయలూ చేతిలో పెట్టిన సుల్తాన్ మీద నమ్మకంపోయి ఈ ఊరుచేరా.

చేరిన కొత్తలో కత్తెర కంపెనీలో కొద్దిరోజులున్నా.. తర్వాత్తర్వాత అక్కడా భుక్తికి లోటేర్పడ్డం మొదలైంది... నమ్ముకున్నకళ మోసం చేసింది... అమ్ముకున్న ఒళ్లూ శిథిలమయింది. చదువా ఎనిమిదో క్లాసు.. ఎవరో చెబితే కిందికులాల కార్పొరేషన్లో నాలాంటి వాళ్లకి ఉపాధికి ప్రభుత్వ సహాయం దొరుకుతుందని వెళ్ళి.

"అయ్యా ! నేను మాలదాన్ని!" అని మానవత్వం తలదించుకునేలా చెబితే

"రుజువేమిటి?" అన్న ప్రభుత్వ నియమాలూ, నిబంధనలూ...!

ఎక్కడ? ఎక్కడని రుజువు తెచ్చేది? నేను మాలకులంలో పుట్టానని నే చదివినూళ్లో సర్టిఫికెట్ తేవాలట. నాదే వూరని వెళ్ళను? అపుడు మొదటిసారి నన్ను పుట్టించిన తండ్రిని తిట్టుకున్నాను. నన్ను నేను తిట్టుకున్నాను.

మీరు మాలలుకాదు. ఇప్పట్నించీ మీరు క్రిస్టియన్లూ అన్న తెల్ల బట్టలేసుకున్న నల్లఫాదరీలను, మా పేర్లు మార్చిన చర్చీలను తిట్టుకున్నా!

విసిగీ వేసారి గాలికి దుమ్ముకీ ధూళికీ కొట్టుకుపోయే జీర్ణ వస్త్రాన్నిలాగా అయిపోయి.. ఇదిగో చివరికి బిందెల ఫాక్టరీలో పాత ప్లాస్టిక్కులు వేరుచేసే ఉద్యోగంలో...!

ఈ రోజున నా ఇంట్లో ఈ చిరిగిన బొంత మీద పడుకున్న ఒకప్పటి సూర్యారావు..

సంధి సూర్యుడు!

చాలా రోజుల తర్వాత కన్నీళ్ళ ఉప్పటి రుచి చూశా!

✦ ✦ ✦

ఉదయం లేవగానే పక్కకు తిరిగి చూసి నిశ్శబ్దంగా కేక వేశా.

నేను రజస్వలైనపుడు చూసి భయపడ్డా.... అంత నెత్తురు .. బొంతంతా తడిసిపోయి, గుడ్లు తేలేసి చూస్తున్నాడాయన.

చేయి తట్టి పిలిచా.. ఏవండీ.. సూర్యంగారూ! ... సూర్యంగారు!" అని.

నిస్సత్తువగా పెదవులు కదిలిస్తూ ఏదో అన్నాడాయన. అర్థం కాలేదు.

భగవంతుడా! ఇదేం శాపం నాకు? సినిమాల్లో నవలల్లోలాగా.. ఈయన ఇక్కడే చనిపోతాడా?

అమ్మో! ఒక మరణాన్ని భరించే ఆర్థికస్థోమత నాకు లేదు.

ఎట్లాగో రిక్షాలో జనరల్ ఆసుపత్రికి చేర్చా. దయతల్చి ఎమర్జన్సీలో చేరుకున్నారు.

కాగితాలురాసుకునే నర్సు ఆయన వివరాలడిగినపుడు/ ఆసంకల్పితంగా మా పాలకొల్లు డ్రామా కంపెనీ అడ్రసు చెప్పేశా. నాకే ఆశ్చర్యమేసింది. పదిహేనేళ్ళయినా డోరునంబరుతో సహా గుర్తుండడం.

మధ్యాహ్నానికి కొద్దిగా కోలుకున్నాడాయన. నేనువెళ్ళి ఆసుపత్రి ఎదురుగా ఉన్న హోటల్లో భయంభయంగా భోజనం చేశా!

దగ్గరున్న కాస్త డబ్బూ ఖర్చు చేసే సాహసం చెయ్యలేకపోతున్నాను. ఎందుచేత? ఒకప్పుడు సూర్యంగారు నన్నురాణిలాగా పోషించాడే!

వీటన్నింటికీ అతీతమైన ఆర్థికసూత్రం నన్ను ఇపుడు భయపెడుతోంది.

ఏమిటిది?

ఆయన్ని నాలుగో వార్డుకి మార్చామని అన్నారు. ఎమర్జన్సీ నుంచి నాలుగో వార్డు కనీసం రెండు కిలోమీటర్లుంటుంది. అక్కడికి నిజానికైతే ఆసుపత్రి సిబ్బందే చక్రాల కుర్చీలో ఆయన్ని తరలించాలి. ఉహూఁ.... ఒక్కడూ పట్టించుకోడే! నాకు తెలికేం కాదు, వీళ్ళకి నేనెందుకు... లంచమివ్వాలి అని అంతే!... అంతే కాదేమో...?! మళ్ళీ నాకు బోధపడని ఆర్థిక సూత్రం.. మనిషి మనుగడకూ అస్తిత్వానికి గొలుసులాగా.. నా డబ్బు ఎందుకివ్వాలనేమో!

ఇరవై రూపాయల్నించీ అయిదు రూపాయలకి బేరం చేసి చక్రాలకుర్చీలో సూర్యం గారిని వార్డుకు తరలించా.

పాయిఖానావైపు పక్క ఇచ్చారు సూర్యంగారికి. విపరీతమైన దుర్గంధం. అద్యంతమూ రోతా, జుగుప్సా కలిగించే జీవితమున్న నాకే అసహ్యం కలుగుతోంది.

"నిన్ను కష్టపెట్టా, నన్ను క్షమించు! కళ్ళనిండా నీళ్లతో సూర్యంగారన్నపుడు నవ్వాను.

ఎక్కడి కళ? ఎక్కడి కళారాధన? అంతా మౌఢ్యం. అన్న నిర్వేదంతో నవ్వాను.

ఇంక వెళ్ళిపో! పర్లేదు! మళ్ళీ అన్నాడాయన. వెళ్తాను గానీ...మీ వాళ్లు.. ఎవరికేనా కబురు చేయనా అడిగా.

నావాళ్ళూ... ఎవరూ నా వాళ్లు? నిజానికి నేను ప్రేమించిన పాత్రలే నా వాళ్లేమో...?! రచియతల కాల్పనికతల్లో ప్రభవించిన ప్రతి పాత్రా నాకు సంబంధించిందే. దేనికీ చిరునామా ఉండదంతే.. నువ్వు కబురు చెయ్యడానికి నాలోకం ఒక ఊహాలోకం. నువ్వు... నువ్వు మాత్రం? నాకు నువ్వెపుడూ నే సృష్టించిన శైలజవే... నా శిథిలనగరం శైలజవే! అంతే.. అంతే! వేదనతో ఆయాసంతో ఉద్వేగంతో అర్తితో ఆగిపోయాడాయన.

సరే, నే వెళ్తా... మళ్లీ రేపుదయాన్నే వచ్చి కలుస్తా... అంతవరకూ రాలేను, క్షమించండి! నిజంగా బాధపడుతూ అన్నాను.

అతను మౌనంగా కళ్లు మూసుకుని పడుకున్నాడు.

మర్నాట్రోజు సాయంకాలం వెళ్లాను అతన్ని చూట్టానికని. వెళ్లేప్పటికి కులాసాగా కనిపించాడు. మొహంలోకి కొద్దిగా జీవకళ వచ్చింది.

ఫాక్టరీ కెళ్ళి వచ్చేప్పటికి అలస్య.. సంజాయిషీ ఇస్తూ అన్నా.

పర్లేదు... నాకే ఇబ్బందిలేదు. ఆస్పత్రివాళ్లే పాలిచ్చారు. ఈ రోజు నించీ అన్నీ తినొచ్చన్నారు. ఏం తినొచ్చనడిగితే నీక్కావల్సింది తినూ...! అనన్నారు. నిజం చెప్పనా... చికెన్ బిరియానీ తినాలనుంది... తెచ్చిపెట్టగలవా?... ఆశ అతనే అయ్యి, అభ్యర్థనగా...!

అమ్మో! చికెన్ బిరియానీయే.. ఇరవై రెండ్రూపాయలు! ఉదయం తొమ్మిది నించీ సాయంత్రం అయిదువరకూ రంపపుకోత... ఊహూఁ...నా వల్ల కాదు... కానీ వీలవదు అని ఎలా చెప్పేదాయనకు?

"అట్లా...గా..! సరే..! వెళ్లి తెచ్చేనా?" అని అప్రయత్నంగా అనేశా.

"ఊఁ.. ఆశగా అన్నాడు సూర్యం

వార్డు బయటికొచ్చి ఉద్వేగంగా రవికెలో దాచుకున్న రూపాయల్ని తడుముకున్నా వారం కూలీ ఇచ్చారు. నూట నలభై. ఆదివారం పనితో కూడి.

ఇరవై రెండ్రూపాయలు చికెన్ బిరియానీకి పెట్టాలి. ఆలోచిస్తూ ఆలోచిస్తూ నెమనెమ్మదిగా ఆసుపత్రి మెయిన్‌గేటు వెలుపలున్నా.

హోటల్లోకి వెళ్లా.

ఏం కావాలమ్మా అని హోటల్ వాడడుగుతుంటే "పులుసన్నం పాకెట్టోటి!" అన్నా. నాకే తెలియని నా గొంతుక.. నాదేనా?! అదినేనేనా...? ఊహూ, మాట్లాడిందినేను కాదు, ఆర్థికతత్వం.

ఆ పులుసన్నం పాకెట్‌ని నిర్లజ్జగా అతనికి అందిస్తూ, ఇపుడు దొరకదుట బిరియానీ.. అందుకని ఇది...! అన్నపుడు ఆత్మ ఘోషిస్తూనే ఉంది.

నాకు తెలీని భాషలో ఏవో మార్మిక మానవ అస్తిత్వ సూత్రాలను మనసు వినటం మానుకుంది.

నిరాశ చెందిన చూపులతో దాన్నే అమృతప్రాయంగా రెండంటే రెండే ముద్దలు

మింగిన సూర్యారావు... సూర్యంగారు నెమ్మదిగా దాన్ని పక్కకు పెట్టి రెండు చేతులూ ఎత్తి నాకు నమస్కరిస్తే.. ఏదో అవమానాన్ని భరిస్తున్నదానిలా తలొంచుకున్నాను. నా ఆత్మతో నిమిత్తం లేకుండానే నా కళ్ళనించీ రెండు బిందువులు జారిపడ్డాయి. స్టాఫ్ నర్స్ వచ్చినపుడు అడిగా - ఏమండీ! నిన్నంతా రక్తం కక్కుకున్నాడు కదా ఆయన! ఈ రోజే అన్నం తినొచ్చు అని అన్నారట? అని. నా వేపు వింతగా అడిగిందామె - పంతొమ్మిదా?'' అని.

అవున్నట్టు తలూపా.

“నీకేమౌతాడు?”

“తెలిసిన వాళ్లంతే!” ఎంత ద్రోహం? ఎంత అమానుషత్వం...?

“అట్లాగా.. ఆయనింకంతే.... కావాల్సినవాళ్లుంటే టెలిగ్రాములిచ్చేయి.. అయిపోయింది!” అతి శాంతంగా చెబుతూ కదిలిపోయిందామె...

భయం వేయడం మొదలుపెట్టింది. అదే భయం... ఆయన చచ్చిపోతే? ఎట్లా?

చావూ,సంస్కారాలూ.. శవం చేసే ఖర్చులూ అన్నీ ఒక్కొక్కటొక్కటిగా మెదుల్తూ భయపెడుతున్నాయి.

సూర్యంగారి వేపు చూశా. తినలేక అన్నాన్ని పక్కకి వదిలేశాడాయన. బాధతో కళ్లు మూసుకున్నాడాయన.

ఊరికినే కళ్లు మూసుకున్నాడా? లేదూ.. అయిపోతుందా...?

ఈ క్షణమేనా...?

ఈ క్షణాన్నే అయితే ఛ.. నేనిక్కడే ఉంటేశవాన్ని నాకంటగడతారా...?

శవాన్ని తీసుకెళ్లమంటే...?

అమ్మో...!

చూశా.

నాకు తెలీకుండానే ఒక్కో అడుగూ సూర్యంగారి వేపు నించీ వార్డు వెలుపలికి. ఒక్కో అడుగూ.. చిన్నగాపరచుకుంటూన్న చీకట్లలోకి నన్ను నేను నా నుంచీ దాచుకునే ప్రయత్నంలో..

తనకై తాను సృష్టించుకున్న 'విలువ' అన్న ఆర్థిక సూత్రం మనిషిని తరిమి తరిమి కొడుతోంది. ✦

***(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక : 2 నవంబరు 1998)***